పురుషార్థం

అవసరాల రామకృష్ణారావు

ఘనకీర్తి అయిన గురుమూర్తి ఆ మాట అనిపించుకోడానికి ఎంతటి త్యాగం చెయ్యవలసి వచ్చిందో ఎవరైనా ఎరుగుదురా అని!

* * *

భవాని రెండు కాగితాలు పట్టుకుని భర్తదగ్గర కొచ్చింది.

మొదటిది ఇలా చదివింది:

చిరంజీవి గురుమూర్తికి—

నీకూ, నీ భార్యకూ మా మనః పూర్వక ఆశీర్వచనములు. మీ రక్కడ క్షేమంగా ఉన్నారని తలుస్తాను. మేమంతా యిక్కడ క్షేమం.

అయిదు వందల గవర్నమెంటు ఉద్యోగం వదలేసి, ఒక్కసారిగా వెయ్యి రూపాయిల ప్రైవేటు కంపెనీలో చేరావంటే – నా కష్టాలు సగానికి సగం తీరిపోయాయనుకున్నాను. రెట్టింపు ఔతావని కలలో అనుకోలేదు బాబూ! నాకు తగిన ధైర్యం చెప్పే నీ జవాబు కోసం వెయ్యికళ్ళతో ఎదురు చూస్తున్నాను.

అయిదో తారీఖున నీకు జీతాలు యిచ్చేస్తారని వెనక రాశావు. అక్కడి నుంచి ఈ ఊరు మనియార్డరు రావడానికి ఎంతయినా వారంరోజులు మించదు. ఇవాళ ఇరవై రెండు. ఇప్పటికి నీ నుంచి సొమ్ముగాని ఎటువంటి కబురుగాని లేదు.

నిన్ను నమ్ముకుని నీ పెద్ద తమ్ముణ్ణి డాక్టరు చదువులో ప్రవేశపెట్టేను. మీ చెల్లెలికి అప్పు చేసి, పెద్ద సంబంధం తెచ్చాను. ఇంకా చదువుకుంటున్న తమ్ముళ్ళూ, ఎదిగి కూచున్న చెల్లెళ్ళూ నీకు ఉండనే ఉన్నారు.

మీ అమ్మ సంగతి నీకు చెప్పనక్కర్లేదు. ఎప్పట్లా మంచంమీదే ఉంది. ఆ రకం కేన్సరుకి మందన్నది లేదుట. ఎక్కడో దూరంగా ఉన్నావన్నమాటే గాని నా ఆలోచనా, ఆశా ఎప్పుడూ నీ మీదే ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే నూటయాభై పెన్షనుతో, యిన్ని బాధ్యత

లతో నేను బతుకుతున్నానంటే అది నిన్ను చూసుకునే.

ఈ ఉత్తరంలో యీ ఆఖరి పేరా రాయకూడదని నేను ఎంత అనుకున్నా- నా రక్తం పంచుకు పుట్టిన పెద్దకొడుకుతో నా మనసులో ఉన్నది చెప్పుకుంటే తప్పేమిటి - అనిపించి నీ కిది రాస్తున్నాను. అదిగాక ఆర్థికంగా అట్టడుగుకు దిగిపోతున్న కుటుంబలు పరిస్థితు నాలో సున్నితమైన దేదీ మిగలకుండా చేస్తున్నాయి. నీ భార్యమా కేమైనా పంపకుండా అడ్డు పడుతున్నదా అని. ఈ విషయంలో నా సందేహం మాత్రమే రాస్తున్నాను. జవాబు కోరి కాదు. అన్నీ నువ్వే ఆలోచించు. ఏదైనా

మొదట్లోనే కట్టుదిట్టం చేసుకోడం మంచిది. నీ భార్య చూడకూడదని యీ ఉత్తరం మీ ఆఫీసుకు పంపుతున్నాను. వెంటనే ఎక్స్‌ప్రెస్ డెలివరీలో ఉత్తరం, టెలిగ్రాములో సొమ్ము పంపు.

నీ తండ్రి,

వెంగళేశ్వర శాస్త్రి.

'మీరు క్యాంపుకు వెళ్ళేసరికి, మీ నాన్నగారి ఉత్తరం పుస్తకంలో పెట్టి వెళ్ళేరు. అలా యివ్వకపోయినా నే నా ఉత్తరం చదివే ఉండను అందుకనే మగవాళ్ళ కోటుజేబులు తడమడం ఆడవాళ్ళకు అలవాటు. అది కేవలం చిల్లరడబ్బులు కోసమే అనుకోడం మొగవాళ్ళపొరపాటు' అంది భవాని.

'అందుకనే చాలా మంది మొగాళ్ళు కోట్లు కుట్టించుకోరు. కుట్టించుకున్నా జేబులు పెట్టించుకోరు' అనేవాడు మరో పరిస్థితుల్లో అయితే గురుమూర్తి. 'కేవలం జేబులేనా? హృదయాలను తడమగల చాకచక్యం మాకు వెన్నతో పెట్టిన విద్య' అని భవాని జవాబు చెప్పి ఉండేది కూడా. కాని ఈ పరిస్థితులు వేరు.

'మరి మీకు శ్రమెందుకని నేనే మీ నాన్నగారికి జవాబు వ్రాసిపడేశాను లెండి' అంది భవాని 'ఏమని? అన్నట్టు చెయ్యి లెగరేశాడు గురుమూర్తి.

'ఏముందీ, సూక్ష్మంలో మోక్షం చూపించేశాను'

భవాని ఉత్తరం యిలా చదివింది

మహారాజశ్రీ మామగారికి—

మీ కోడలు భవానీశంకరి అనేకము లైన నమస్కారములు. మా అత్తగారి శరీరస్థితి ఎట్లున్నది వ్రాయ గోరెదను.

'నీ భార్య చూడకూడదని ఈ ఉత్తరము మీ ఆఫీసుకు పంపుతున్నాను' అని మీరు వారిపేర వ్రాసిన ఉత్తరమునకు జవాబు పనిలో యుండుటచే వారే నన్ను మీకు వ్రాయమనిరి. మీ ఆదేశము ప్రకారము వారు నాకు మీ ఉత్తరమును చూపించలేదు. ప్రతి అక్షరమును చదివి వినిపించిరి; అంతియే

ఇక రెండవ విషయము. 'ఏదైనా మొదట్లోనే కట్టుదిట్టం చేసుకోడం మంచిది' అని వ్రాసిరి. మీ అమూల్య మైన సలహా ఎంతయు శిరోధార్యము. ఆ విషయము వెంటనే ఆచరణలో పెట్టించెదను మీరు ఏంతమాత్రము నిరుత్సాహపడవలదు క్రమముగా మీకె తెలియును.

తప్పు లున్న క్షమించవలయును.

కృతజ్ఞతలతో—భవాని.

'ఈ ఉత్తరం యిలా యిచ్చేయ్. యింకా నయం పోష్టు చేశావు కాదు, కొంప ంటుకుపోను' అన్నాడు గురుమూర్తి

'అయితే వెంటనే ఫైర్ స్టేషనుకు ఫోన్ చెయ్యండి' అంది భవానీ నవ్వుతూ.

'ఇది కాపీ మాత్రమే మీకు విని పించాలని యిదిమాత్రమైనా ఉంచాను. దీని అసలు ఈ పాటికి మెయిల్లో. ఆర్. ఎం. ఎస్. పెట్టెలో, ఇన్లెండు కవర్లో— ప్రయాణం చేస్తూ ఉంటుంది'

గురుమూర్తి జవాబు చెప్పేలోగా భవానీ దగ్గిరగా వచ్చి అతని గెడ్డం పట్టుకుని కళ్ళలోకి చూసింది. గెడ్డంమీద వెంట్రుకల్ని అరచేత్తో రాసింది అంతే.

అతని కా క్షణంలో యింకేం జ్ఞాపకం లేవు.

కావాలని ఆమె పైట జారిపోయింది.

ఇంకేం కావాలని అతని గుండె జారి పోయింది.

అతను ఆమె రెండు భుజాలూ గట్టిగా పట్టుకున్నాడు, పిచ్చిగా ఆమెలోకి చూస్తూ.

'ఉండండి'

'ఏం?'

'ఈ చీర విప్పి, మరొకటి కట్టుకు వస్తాను.'

'నువ్వు చెప్పిన వాక్యంలో మొదటి సగమూ చేస్తేచాలు!'

ఇద్దరూ నవ్వుకున్నారు.

మరుక్షణం వాళ్ళిద్దరూ 'మరు'క్షణం అనుభవిస్తున్నారు.

కైకేయి దశరథుణ్ణి ఏ పరిస్థితుల్లో వరాలు అడిగిఉంటుందో, బహుశా ఆ పరిస్థితుల్లో ఉండిఉంటారు. ఒక్కటే తేడా: ఆనాడు కైకక్క అడిగిన వరాలు రెండు మాత్రమే!

* * *

ఆలోచనల్ని మించిన నల్లులూ, చికాకుల్ని పెంచిన దోమలూ లేవను కుంటే గురుమూర్తికి ఒంటిగంటా అయే సరికల్లా తెలివి వచ్చేసింది. అతనిలో మానవుడు లేచి కూచున్నాడు. దీపం వెలిగించుకున్నాడు.

'ఈ నెల జీతంలో మిగిలింది ఎక్కడ పెట్టేవ్?'

ఏమాత్రం విసుగు కనపర్చకుండా భవాని లేచింది. తలగడా గలీబులో దాచిన తాళాలగుత్తి పైకి తీసింది. బీరువా తలుపులు తెరిచింది.

ఉన్న విషయాలు ఉన్నట్టు చెప్పు కుంటే ఎంత చిత్రంగా ఉంటాయి. ఈ మధ్య వారపత్రికలో 'విప్పులాంటికథ' అనే మంచి కథానిక పడింది. మీరు చదువుతారని కట్ చేసి దాచిఉంచాను. ముందిది చదవండి.'

చీర మడతల కింద దాచిన అచ్చు కాగితాలు భవాని పదిలంగా భర్తచేతి కిచ్చింది. డబ్బు పంపించమని పదే పదే కొడుకుని వేధించిన ఒక తండ్రి కథ



అది. ఆ కథకు చిన్న ముందుమాట రాస్తూ రచయిత యిలా రాశాడు. 'పితృ దేవోభవ అని ప్రబోధించే భారతదేశం మనది. పున్నామ నరకంనుంచి తప్పించ టానికి పుట్టినవాళ్ళు పుత్రులు అని నమ్మిన వాళ్ళం మనం. ఆదేశాలకీ, ఆచరణలకీ అదెంత దూరమో చెప్పడమే నా ఉద్దేశం. సత్యాన్ని చాటినప్పుడు వినడం మీ కిష్టం లేకపోతే నన్ను శపించండి. క్షమించండి, అని మిమ్మల్ని అడగవలసిన అవసరం మాత్రం నాకు లేదని నిష్కర్షగా చెబుతున్నాను.

కథ చాలా చిన్నది. అది కొడుకు తండ్రికి రాసిన ఉత్తరం మాత్రమే. అదైనా పది పాయింట్లు. సచ్చిదానందం సర్వాబద్ధం గారి పెద్దభార్య కొడుకు. తను కాపురం పెట్టేకకూడా పదేళ్ళపాటు అతను తండ్రికి నెలకి ఏభై రూపాయిల చొప్పున ఒక నెలా తప్పకుండా పంపించాడు. కూతురి పెళ్ళి చెయ్యడంవల్ల ఓసారి రెణ్ణెల్లపాటు సచ్చిదానందం సొమ్ము పంపించలేకపోయాడు. తండ్రి చాలా ఘాటుగా కొడుక్కి ఉత్తరం రాశాడు. ఆ క్షణంనుంచీ సచ్చిదానందం సొమ్ము పంపించడం మానేశాడు. తండ్రి ప్రతి మాటకీ తగిన సమాధానం చెబుతూ సచ్చిదానందం రాసిన ఉత్తరం 'ఇంట్లో పెద్ద కొడుకుగా పుట్టడం కంటె అడవిలో పెద్దపులి నోట్లో పడడం మంచిది' అనుకునే వారంతా ఎగి రెగిరి

గంతులేస్తూ చనవవలసినది. ఆ పది విషయాలూ - పెన్ కమాండ్ మెంట్సు - యివీ:

1. నిన్ను నవమాసములు మోసి,

...మీరు మొయ్యలేదనుకుంటాను ' ప్రపంచంలోని అన్ని జడజీవరాశులకీ గర్భ ధారణ యింతకాల మని ప్రకృతి నిర్ణయించింది. ఆ ప్రకారమే, అంద ర్లాగే, అందరితోపాటే అమ్మ నన్ను మోసింది గాని నా కోసం కనీసం ఒక్క నెలయినా ఎక్కువ మోసిం దనుకోను. ప్రత్యేకించి చెప్పడం దేనికీ ?

2. కని,

...కనక, మరోమార్గం లేదుకనక అలా జరిగి ఉంటుంది. అయినా ఆ మరోమార్గం ద్వారా నన్ను మరో ప్రపంచానికి పంపించే ప్రయత్నం జరిగినా జరిగిఉంటుంది. ఆ రోజుల్లో అమ్మచేత మీరు లోపాయికారిగా ఎన్నిమందులు మింగించారో ఎవరి కెరుక ?

3. పెంచి,

...ఎవరి పిల్లల్ని వారు పెంచుకో వడం ఊరికి ఉపకారమా · ఇంకా ఏ దిక్కుమాలినవాడో, ఏ పైకులంకుర్రాడో అలాంటివాణ్ణి తెచ్చి పెంచుకున్నామంటే నలుగురికీ చెప్పినా చెప్పకున్నా అందమూ చందమున్నూ. అయినా ఎప్పటికప్పుడు పిల్లలు తల్లిదండ్రులకు ఏమీ యివ్వడం లేదా? బుల్లి బుల్లి పిల్లలు ఊరంతా ఏకమైనట్టు నవ్వుతూంటే, భూమంతా దద్దరిల్లేట్టు అడుగులేస్తూంటే, ప్రపంచమంతా మారుమోగేటట్టు అరు స్తూంటే మురిసిపోని తల్లితండ్రు లున్నారా ?

4. విద్యాబుద్ధులు చెప్పించి,

...చెప్పించకపోతే తలో చిప్పా పట్రా యిప్పు నడివీధిలోకి పంపెట్టక పోయూరా ? అలా చేస్తే మీ మొహాన్ని నలుగురూ పేడనీళ్ళు జల్లుతారని భయమూ ! ఇంతకీ ఇదంతా మీ ప్రయోజ కత్వమేనని స్వతహా పిల్లలు పుట్టుకతో తెచ్చుకున్న జ్ఞానమంటూ లేదా యేం ! బొత్తిగా కుంత అయిన గుంటక్లి తండ్రి ఏం చెయ్యలేదు, వాడి చావు ఏం చెయ్యలేదు. అనేకమంది అనాథలు స్వశక్తిచేత పైకి రావడమూ మనం ఎరుగుదుం. దీని కేం జవాబు చెబుతారు ?

5. మేము తినినా మానినా పిల్లలకి పెట్టి,

...ఇలాంటివాళ్ళు నూటికి ఏ పది పది హేనుమందో ఉంటారు. అలాంటి స్వల్పమైన సంఖ్యలో అందర్నీ చేర్చడం అన్యాయం. ఒకవేళ అలా పెట్టినా 'వీడు పెద్దయి రేపొద్దున్న మన్ని ఒక కంటితో చూడకపోతాడా' అనే స్వార్థం తోనేగా !

6 ఉద్యోగం యిప్పించి,

...క్వాలిఫికేషనూ, అదృష్టమూ వుంటే ఒకళ్ళు యిప్పించే దేమిటి ?

7. కట్నం పుచ్చుకుని,



...'వీడి చదువుకోసం ఇంత ఖర్చు పెట్టేం; అది ఎవరో ఊరివాళ్ళ మీద పడి లాగుదాం' అన్న సిగ్గుమాలిన పని పైకి చెప్పుకోడం కూడానా? 'నా బాబు దగ్గిర వీళ్ళ బాబు యింత సొమ్ము గుంజేడు. అంతకు అంతా కక్కించని నా జన్మేల?' అని తొయ్యాలి తోలినాడే తెయ్ తెయ్యి మని ఆడిందంటే ఆ నేరం ఎవరిది?

8. యధావిధిగా పెళ్ళి చేసి.

...మర్యాదలు సరిగ్గా జరగలేదనో, ముచ్చట్లు బాగా తీరలేదనో – తప్పులు పట్టుకోడానికి అన్ని అవకాశాలూ గల, రక్త మాంసాలు వదులుకుని శల్యాలు పట్టుకు ఏడ్చే, నేటి వివాహాల పద్ధతేగా యథావిధి? బతికున్నన్నాళ్ళూ కలసి జీవించవలసిన వధూవరులకు పెళ్ళినాడే ఒకరి కుటుంబంమీద మరొకరి కుటుంబానికి చిన్నచూపు ఏర్పడి విద్వేషాలకు బీజం ఏర్పడేదీ అప్పుడేగా!

9. నువ్వూ నీ పెళ్ళామూ చిలకా గోరింకల్లా కాపురం చేస్తూంటే ఎంతో ఆనందించి,

... కేవలం నోటి మాట. 'వాళ్ళ మటుకు వాళ్ళని ఏడవనీ' అని ఏ తల్లి తండ్రులూ పిల్లల్ని సుఖంగా బతకనివ్వరు. పిలవని పేరంటంగా వారి సంసారాల్లో ప్రవేశించి, ఆమోదయోగ్యంగాని సలహాలు ఇచ్చి, అనవసరమైన ఆరాలు తీసి–ముచ్చటైన కాపురాల్లో చిచ్చు రేపేది ముఖ్యంగా పెద్దవాళ్ళే.

ఏ యువకుడి హృదయంలో అయినా దూరి అడిగి చూడండి, తెలుస్తుంది.

10. ఎన్నో విధాల త్యాగం చెయ్యడం ఇందుకేనా?

...ఇందులో ఏవీ త్యాగమనే పదానికి పరిధాపుల్లో లేదని ఈ ప్రశ్నే రుజువు చేస్తోంది. ప్రయోజనం ప్రతిగా కోరింది త్యాగ మనిపించుకోదు.

నాన్నా, ఇలాంటి ఉత్తరం రాసినందుకు నాకు సిగ్గుగా ఉంది. తప్పనందుకు విచారంగానూ వుంది. ఇన్నాళ్లూ నీకు డబ్బు పంపించానంటే అమ్మమీద అంతో యింతో అభిమానం—అభిమానం మాత్రమే, గౌరవం కాదు!—నాకు మిగిలి ఉండడమే కారణం. పిల్లల్ని పెంచి పెద్దవాళ్ళను చెయ్యడం పెద్దవాళ్ళ డ్యూటీ అనుకున్న తల్లిదండ్రుల్ని మాత్రమే ప్రాజ్ఞులయిన పిల్లలు ప్రేమించి, సేవించ గలరు. — సచ్చిదానందం.

'ఈ కథమీద తమరి అభిప్రాయం?' అంది భవానీ. గురుమూర్తి జవాబు చెప్పలేక పోయాడు. మరొక గ్లాసు మంచినీళ్ళు తాగి—

'ఇప్పటికే ఆలశ్యమైపోయింది. వాళ్ళు నానా ఇబ్బందులూ పడుతుంటారు. పొద్దుటే టీ. ఎం. వో. పంపేస్తాను; సొమ్మెక్కడుంది?' అన్నాడు హీన స్వరంతో. ఆ స్వరంలో మార్పు చూసి భవానీకి ముచ్చట వేసింది. తన ఆధిక్య తను గుర్తించడంవల్ల ఆమె కన్నులు మెరిశాయి. నాలుగు పచ్చనోట్లు తెచ్చి అతని కిచ్చింది. 'ఇంటద్దే, పాలూ, పనిమనిషీ పోగా మిగిలింది వందలు మిగిలాయి. సగం నాది—నేను మిమ్మల్ని పోషించగలిగిన మిగిలింది మీ యిష్టం' అంది. అక్కడికీ ఊరుకోలేదు.

'మీ వాళ్ళు నాకు పైవాళ్ళా అత్తా? ఎటొచ్చీ వాళ్ళు నన్ను ఇన్నాళ్ళకీ పైదానిగా గుర్తించడం నా దురదృష్టం.' అంది గద్గద కంఠంతో. గురుమూర్తి భార్యవైపు చూశాడు. ఆ మొహంలో నిజాయితీ, ఆ స్వరంలో మానవతా కనిపించి అతణ్ణి ముగ్ధుణ్ణి చేశాయి. 'ఒకరయినా నన్ను అర్థం చేసుకున్నారు అంతే చాలు' అనే భావం అతన్ని ఆమెకు మరింత దగ్గిర చేసింది.

* * *

క్రమంగా అర్ధాంగి త్రీఫోర్త్రాంగి అయికూచుంది.

ఆనెల ఇంటికి రెండొందలు మాత్రమే పంపగలిగాడు గురుమూర్తి. "మీ తమ్ముళ్ల బాధ్యత మీ దెందుకయింది? అది మీ నాన్నగారిది. రేపొద్దున మనకి పిల్లలు పుడితే ఆ బాధ్యత మాత్రమే మనది.' అని భవానీ గురుమూర్తి కెప్పుడూ నూరిపొయ్యలేదు. పైగా 'ఎంత మిగుల్చుదామన్నా ఈ కాని పట్నంలో ఖర్చులకాలంలో, మిగల్చలేకుండా ఉన్నాను. పాపం, అక్కడ ఆ ముస

లాళ్ళు ఎంత బాధ పడుతున్నారో..." అనేది.

సరిగా యిటువంటి సమయంలోనే ఇంటినుంచి ఉత్తరాలు వచ్చేవి. అలాం టప్పుడు అందులో ఏముంటుందో భవానీ ఊహించలేనిదేంకాదు. చింపకుండా నే అందులో ఏముందో ఆమె చదవగలిగేది. పగలల్లా ఆఫీసులో పనిచేసి సాయంకాలా నికి భార్యతో వేసుకునే ప్రోగ్రాం గురించి కలలుగంటూ గురుమూర్తి ఇంటికి వచ్చేసరికి — నీ భార్య మంచిదికాదు. మనం తెలియక గోతిలో పడ్డాం — వాళ్ళ వాళ్ళు బొత్తిగా లేనివాళ్ళు. మరీ నీచపు మనుషులు. అందుకే నిన్ను వాజమ్మను చేసి ఆడిస్తోంది. ఇంతకీ ఆమెను అను కోవడం దేనికి? నువ్వింత నిర్వీర్యు డవై పోడం మా దురదృష్టం — అంటూ ఉత్తరాలు వచ్చేసరికి అతనికి లోకం మంతా చీకటైపోయినట్టు అనిపించేది. ఆ కవరు చింపబడకుండా ఉండడం అత నికి ఆశ్చర్యం కలిగించేది. తడిగుడ్డచే గొంతుకే కొయ్య నక్కర్లేదు. కవరు నెమ్మదిగా విప్పి మళ్ళీ అంటించవచ్చు అని అతనికి తెలీదు.

'ఇంటినుంచేనా ఉత్తరం, అను కున్నానెండి. అందరూ కులాసాయేనా? ఈనెల మరచిపోకుండా మరోరెండొం దలు పంపండి. ఎంత యిబ్బంది పడు తున్నారో ఏమిటో — నా కిప్పుడు నూట ఏభై పెట్టి రిష్టువాచీ కొనకపోతే కాల చక్రం ఆగిపోదు.' అంది భవానీ. ఏమి ఊహించి ఆమె అలా అందో అలాగే జరిగింది.

ఆమెచేతికి ఆరగంటు దాటకుండా వాచీ వచ్చింది.

'డబ్బు పంపేది నేను, అందుకునేది మీరు. మధ్య నాభర్త ప్రసక్తి ఎందుకు? నెలకి ఎంత పంపుతే మీకు తనివి తీరు తుంది? స్పష్టంగా రాయరాదూ?' అని రెండుముక్కలు రాసి గురుమూర్తి పోష్టుచేశాడు. వెంటనే జవాబు వచ్చింది. ఎంతపట్నమయినా ఇద్దరు మనుషులకి రెండొందలు ఏభైకంటె ఎక్కువ అన వసరంట. కావలిస్తే భవానీ,పాపం,చిన్న పిల్లా, సరదా లుంటాయిగనక, ఓ ఏభై ఉంచుకోవచ్చుట. ఏమాత్రం తల్లిదండ్రు లంటే భక్తీ గౌరవమూ ఉన్నా నెలకి ఏడొందలూ పంపితీరాలిట — అంతకు తక్కువ పంపితే తిప్పుకోవలసి వస్తుందిట. అంతగా గురుమూర్తికి ఏదైనా అవసరా లుంటే తండ్రికి రాసి తెప్పించుకోవచ్చు నట

గురుమూర్తి ఆ ఉత్తరం భార్యకి చదివి వినిపించాడు. అందులో అతన్ని మనస్సా నొప్పించిన విషయాలు యివి.

తను సంపాదించిన సొమ్ము ఖర్చు పెట్టుకునే స్వాతంత్రం తనకి లేదా? తన జీతంలో పాకెట్ మనీకి నెలకి పదిరూ పాయిలయినా తనకి అవకాశం లేదా??

అంతగా అవసరమైతే తనే రాసి తెప్పించుకోవాలా ?

'పోనీ కొన్నాళ్ళపాటు నేను అక్కడికి వెళ్ళిపోతాను. మీరు ఏ హోటల్లోనో తింటూ నెలకి తొమ్మిదివందలు దాకా పంపొచ్చు' అంది భవానీ. గురుమూర్తి జవాబు చెప్పలేదు. వెంటనే కలం కాగితం తీశాడు 'నిప్పులాంటి కథ' లో సచ్చిదానందం పంపేశాడు. భవాని ఆ కథ తీసి చాటుగా మడిచిపెట్టుకుంది. చీరల మధ్యనుంచి తీసి. జాకెట్ల మధ్య గంధపుపొట్లాలమధ్య ఆ కాగితాలు అతిపదిలంగా దాచుకుంది.

* * *

'రెండు వందలుంటే యిద్దూ,' అన్నాడు గురుమూర్తి ఆరునెలల తరువాత ఓ సాయంకాలం ఇంటికొస్తూ. 'దేనికి ?' అంది భవానీ కనుబొమ్మలు కొద్దిగా చిట్లిస్తూ. అలా ఎప్పుడూ ఆమె అడగనూలేదూ, అలా చూడనూలేదు. అనుకోకుండా అతనూ తిరుగుప్రశ్న వేశాడు.

'నీతో చెప్పాలా ?'

ఆ లోపం వాళ్ళిద్దర్లోను లేదనుకుంటే ఆ తప్పు ఆ దుర్ముహూర్తాన్ని మాత్రమే. ఆమె విసురుగా యిన్నినోట్లకట్టలు తెచ్చి అతనిముందు పడేసింది.

'అవసరంలేదు. మీరు సంపాదించిన సొమ్ము జాగ్రత్తగా కూడబెట్టవలసిన అవసరం నాకూ లేదు!' అనేసి ఇంతమోహం చేసుకు లోపలికి వెళ్ళిపోయింది – ధళ్ళని తలుపు వేసేసింది.

గురుమూర్తి లోపలికి వెళ్ళలేదు. ఆశ్చర్యంగా అటే చూస్తూ అక్కడే ఉండిపోయాడు చాలా సేపు. ఆవాళ అతను రెండువందలడిగింది, నిజానికి ఆమెకి కొత్తరకం పట్టుచీర కొందామని! కాని అతను కొన్నది వేరు. అన్నాళ్ళ నుంచో అనుకుంటున్న టెన్నిస్‌బాటు కొనుక్కున్నాడు. మిగిలిన డబ్బు బీరువాలో ఉంచేశాడు.

అతన్నలా వెళ్ళనిచ్చి భవానీ అక్కడే కూచుని ఆలోచించింది.

'నాన్నా! యీ డబ్బు నీ దగ్గిరుంచు. ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మడం మంచిది కాదు' అని తండ్రిపేర అయిదువందలు మనీయార్డరు చేసింది. మనిషిరక్తం రుచిమరిగిన పులిలాగ–భవానీతండ్రి ఆ సొమ్ము అందుకుని తక్కిన ప్రపంచాన్నే మరచిపోయాడు. ఉన్న పొలం కాస్తా అమ్మేసి ఒక్క కూతురు కదా అని తలకు మించిన సంబంధం చేశాడు. కూతురు ఒక్కర్తె. కొడుకులు అరుగురు. ఒక్కరికీ డిగ్రీ అయినాలేదు. వాళ్ళ దర్నీ పైకి తీసుకురావడం ఎలాగ? ఇన్నాళ్ళకు బంగారుగుడ్లు పెట్టే కోడి దొరికింది! తనేం తాగుబోతు కాదు; తప్పుడుదార్లు తొక్కినవాడు కాదు–తను తింటున్నది కూడా పైవాళ్ళ సొమ్మేంకాదు. ఏం తప్పా? అనుకున్నాడు భవానీ తండ్రి

పరమేశ్వరంగారు ప్రతీనెలా పసియార్డు అందుకుంటూ.

* * *

'మీ నాన్నగారి పేర సుప్పు పంపు పున్న డబ్బంతా కూడబెట్టి మీ నాన్న నీ పేర ఏ భూమయినా కొని నీ కేదో విరాళం చేస్తా డనుకుంటున్నావేమో! పొరపాటు. నీ పేర బ్యాంక్ ఎకౌంట్ లో ఏమీలేదు. కావలిస్తే వెళ్ళి చూసుకో' అని ఆ ఊర్నుంచి వచ్చినవా రొకరు భవానితో చెప్పగా, ఆదేదో తండ్రిని గట్టిగా అడిగేద్దామని—తల్లికి జబ్బుగా ఉందని మొగుడితో బొంకి—ఆమె ఆ ఊరు వెళ్ళింది; ఆ యింట్లో అడుగు పెట్టింది.

అది పుట్టిల్లు.

తనని నవమాసములు మోసి, కని పెంచిన తల్లి ఉన్న యిల్లు.

తనకి మంచి సంబంధం చేయడం కోసం తన అన్నదమ్ముల చదువును కూడా లెక్కచెయ్యని తండ్రి...ఉన్న యిల్లు.

తనవల్ల నిర్భాగ్యులైన అన్నదమ్ము లున్న యిల్లు.

భవానీ తండ్రిని ఏమీ అడగలేక పోయింది.

ఇంటికి వచ్చిన మరునటి నెలనుంచీ మరొక ఏభై బట్వాడా ఎక్కువ చేసింది!

* * *

'అలివంకవారు నీకు ఆత్మబంధువు లైనారు. కని పెంచినవారు చచ్చారో బతికారో కూడా లక్కచేయని అధమస్థితిలో ఉన్నావు. కానియ్యి రేపొద్దున నీ పిల్లలు పుట్టి నీకు కళ్ళు తెరిపించే రోజు రాకపోదు,' అని సంగమేశ్వరశాస్త్రులు కొడుక్కి ఉత్తరాలు రాయడం మానలేదు; కాని ఆ రోజూ రాలేదు; గురుమూర్తికి పిల్లలూ పుట్టలేదు.

ఒకనాడు తండ్రిదగ్గిర్నుంచి వచ్చిన ఉత్తరం చూసి మనసంతా పాడైపోయి గురుమూర్తి అదోలా ఉండగా పక్కింటి ప్రసాదు వచ్చి పలకరించాడు. ఇన్నాళ్లూ రెండోకంటివాడితో చెప్పకుండా కడుపులో పెట్టుకున్న కష్టమంతా స్నేహితుడి ముందు వెళ్ళగక్కేశాడు గురుమూర్తి.

'వేలకువేలు ఆర్జిస్తున్నారనీ, లిమిటెడ్ ఫామిలీ అనీ, ఎటువంటి చికాకులూ లేని అదృష్టవంతు లనీ—మిమ్మల్ని చూసి మేమంతా అసూయపడుతూ ఉంటాం. మీకు ఇన్ని గొడవ లున్నాయా గురుమూర్తిగారూ! ఎంత చిత్రం! అయితే మీరు ఒకవైపే నమ్ముకున్నారు. ఆ లెక్కకి అదృష్టవంతులే...నాలా రెంటికీ చెడ్డ రేవడి కాలేదుగా?'

'అదేమిటి?' అన్నాడు గురుమూర్తి.

'ఇంటి నిండా నలుగురుపిల్లలతో మూడొందల ఉద్యోగంతో యీ కరువు కాలంలో ఎలా ఈడ్చుకొస్తున్నానో నాకే తెలుసు. మా అత్తగారూవాళ్ళూ

పై వాళ్లు గనక నన్నర్థం చేసుకోలేదంటే బోధపరుచుకోవచ్చు. మా నాన్నావాళ్లూ నన్నాడిపోసుకుంటే ఎలా అర్థం చేసుకోను? మా బావమరిది ఫీజు కట్టలేక పరీక్ష మానేసినా, మా మావగారి మందుల షాపు దివాళా తీసినా నేను కాణీ పంపలేదు. కాని మా ఆవిడ గీచిన గీటు దాటనని నాకు మా యింట్లో పేరు. ఎలా చాపను? అందుకే అంటాను. మీకు ఏదైపేనా మంచిపేరున్నది సంతోషమని. అదైనా నిలబెట్టుకోండి, నాకు పరమ సంతోషం.'

'మళ్ళీ అలా అంటారేమిటి?

'ఈ లోకంమీదా, ఈ విమర్శలమీదా నాకు నమ్మకం చాలక.'

'అంతేనా, లేక నా మీదకూడా నమ్మకం.. '

'మన మంచి మనం చూసుకోదలిస్తే ఎవ రెలా అనుకున్నా మనకి బాధ ఉండదు. అది చేతగాకే ఇంత బాధ.'

ప్రసాదు అన్నవాంట్లో ఆంతర్యమేమిటో గురుమూర్తికి అర్థంకాలేదు.

'ఇదివరకు మిమ్మల్ని మీ నాన్నగారు పాలించేవారు. ఇప్పుడు మీ మామగారు మిమ్మల్ని ఏలుతున్నారు. మనం మట్టిబొమ్మలమైతే మసలడం సుళువే. కాని ఏలాంటివాళ్ళనీ 'నాకు సుగిలిందంటూ ఏం లేదా' అనే ప్రశ్న సాధించక మానదు.'

'నన్నిప్పుడు నడిపిస్తున్నది నా భార్యేంటే ఒప్పుకుంటాను; కాని అది అంత అన్ రీజనబుల్‌గా ఉంటుందంటే...'

'ఎందుకో చెప్పకుండా ఒక అయిదు పందలు మీకు కావాలని పుచ్చుకోండి చూద్దాం అయితే,' అని సవాలు చేశాడు ప్రసాదు.

ఆ రాత్రి ఎంత అల్లరి జరుగాలో అంతా జరిగింది.

ఆ వాసీ, గురుమూర్తి కనీసం ఏభైసార్లయినా ఒకరికొకరు విడాకులు యిచ్చుకుని వుంటారు, ఆ పదిగంటల్లోనూ. కాని తెల్లవారేసరికల్లా ఒకి మంచంమీంచి లేవడమే మహాచిత్రం దేని దారి దాన్దే.

* * *

గురుమూర్తికి ప్రమోషను వచ్చింది

ఇప్పు డతని జీతం పన్నెండొందల యాభై.

మొదటి నెల జీతం అందగానే ఫ్రెండ్సందరికీ అతను డిన్నర్ ఇచ్చాడు హోటల్ ప్యారడైజ్‌లో. ఆ రాత్రి అందరూ యింటికి తిరిగివెళ్ళే ప్రయత్నంలో, స్టెనో చంచలని అతను కారుమీద స్వయంగా దిగబెట్టవలసివచ్చింది.

'మీ జీవితంలో యిది మరచిపోలేని రోజు. కాని, దానికి తగ్గట్టుమాత్రం లేదు మీ పోజు,' అంది చంచల అతని పక్కకి జరుగుతూ.

'ఏం చెప్పను మిస్ చంచలా!

ఎంత జీతం అయితే నేం, సుఖమన్నది లేకపోయాక! ఇంతకంటె నా జీతం ఏ నూటయాభై యో అయితే మా వాళ్ళంతా నన్ను మరింత సానుభూతితో చూద్దురేమో.'

'నోనో, యు ఆర్ స్టిల్ ఇన్ ది డార్క్‌నెస్. మీ జీతం నూటయాభై అయితే, మీ వాళ్ళందరూ — మీ ఆవిడతో సహా — మీ మొహాన్ని ఉమ్మేద్దురు. లేనితనం అదేం మగతనం! ఛ ఛ!'

'ఇంత వుండి నేను అనుభవిస్తున్న దేమిటి చెప్పండి? నన్ను కట్టుకున్న దయినా నిస్వార్థం చేసుకోకపోతే యింకెందుకు?'

'అసలు మిమ్మల్ని మీరు అర్థం చేసుకున్నారా అని.'

గురుమూర్తి తెల్లబోతూ ఆమెవైపు చూశాడు.

'చల్లగా ఉంది; నిర్మానుష్యంగా ఉంది; కారు ఓసారి ఆపండి. లెటజ్ ఎంజాయ్ ఎండ్ గో.'

ఆమె తన కాలితో అతనికి బ్రేక వేసింది. అతని కాలు అప్రయత్నంగా కారుకి బ్రేకు వేసింది.

'అనుభవించడం చేతగాక ఒకరి మీద అలుగుతారు దేనికి? వయసయితే వచ్చింది ఏం లాభం. వట్టి పాపాయి,' అంది చంచల నవ్వుతూ.

నిజంగానే అతను ఆమె ఒళ్ళో పాపాయి అయిపోయాడు.

'ఎంత పొరపాటు జరిగింది!' అని అతను అనుకోకుండానే!

'మీ మటుకు మీరు కొంత హాపీనెస్ డిలప్ చేసుకోండి. తప్పేంలేదు. ఎవరి దృష్టిలో — పరిస్థితిలో. వాళ్ళలా చేస్తూనే ఉంటారు.'

'ఇలా జరిగిందని ఎప్పటికేనా తెలిస్తే?'

'మిమ్మల్ని సానుభూతితో అర్థం



చేసుకునేవాళ్ళెవరైనా ఉంటే ధైర్యంగా చెప్పండి. అలా కానివాళ్ళతో ఎలా మెలగాలో యీపాటికి మీకు తెలిసే వుండాలి.'

'ఎలాగ?'

'ఓయి పిచ్చినాయనా, ఇంత వెర్రి వాడివి అంత పెద్ద ఉద్యోగం ఎలా వెలగబెడుతున్నావయ్యా? ఆమాత్రము అప్పటి కేదో చెప్పెయ్యలేవా? భలే వాడివే అయితే మచ్చుకి మొదటిపాఠం చెబుతాను, నోట్ చేసుకో. తిన్నగా బజారుకి వెళ్ళి సిల్కుచీర ఏభై రూపాయలది ఒకటి కొను. కృష్ణచంద్ ఇల్లు సిల్కుపేలస్ పక్కనే. లేపు చీర తీయించు. నీ కయితే యిస్తాడు. ఇంటికి తీసికెళ్ళి రెట్టింపు ఖరీదు చెప్పి, మీ ఆవిడకి ప్రెజంటు చెయ్యి. ఇవాళ నీకు జీత మొచ్చిందిగా, ఎక్కువగా...'

'ఇంత ఆలశ్య మెందుకయిందని అది అడిగితే?'

'పోయి మాసిన సంబరంలో యింక అడగటానికి తీరికఎక్కడ య్యా? అందుకే మగాళ్ళు 'వీపీ టు ది పవరాఫ్ ఎన్' అన్నారు. అలా చూస్తావేం, బయల్దేరు.'

'ఇదే ఐతే, ... సంహాకి కృతజ్ఞుణ్ణి'

'ఉత్తుత్తి మాటలేనా? భలే వాడి వయ్యా! ఫీజు పుచ్చుకోందే కేసులు పట్టడం నాకు అలవాటు లేదే!'

చంచల అతనివైపు నవ్వుతూచూసింది.

'ఎంత?'

చంచల రెండు చేతులూ ఎడంగా చాపి 'ఇంత' అంది. గురుమూర్తి తెల్ల బోతూంటే.

'ప్రస్తుతానికి ఓ నూట ఏభై యిచ్చి-చాలు' అంది అంటూ, 'నువ్వు యివ్వడం ఎందుకూ, మీ వాళ్ళచేత నేనే తెప్పిస్తాను. చూడు ఇవ్వడమేగాని పుచ్చుకోడం నీకు అలవాటులేదు కాబోలు కర్మ - సరే మా నాన్న దయాసాగరం ఎడ్రసు ఇద్దువుగాన్లే...అలా తెల్లబోతావేం? నే చెబుతాను రెండు ఉత్తరాలు రాయి.' గురుమూర్తి ఆమె చెప్పినట్టు రెండు ఉత్తరాలూ రాశాడు. అందులో ఒకటి అతని తండ్రి సంగమేశ్వరశాస్త్రులుకి.

'ఇన్నాళ్ళూ తల్లితండ్రుల్ని దూరం చేసుకుని, భార్య చేతిలో కీలుబొమ్మనైనందుకు సిగ్గుపడుతున్నాను. మా మావగారు నన్ను పూర్తిగా బికారిని చేసేదాకా నాకు జ్ఞానోదయ మవలేదు. మాకు జీతాలుకూడా సరిగ్గా అందక, దాన్ని కొన్నాళ్ళపాటు పుట్టింటికి పంపేద్దామా అని చూస్తున్నాను. ఏ మాత్రం వీలయినా ఓ ఏభైరూపాయలు, నాకు అన్నివిధాలా కావలసినవారైన పెద్దలు, పూజ్యులు శ్రీ దయాసాగరంగారి పేర పంపవలెను. (ఎందుచేతంటే నా పేర డబ్బువస్తే బ్రహ్మరాక్షసి అయిన నా భార్య అది నాకు దక్కనివ్వదు.)

రెండో ఉత్తరం పరమేశ్వరంగారికి.

'గతనెల భవానీ పంపిన సొమ్ము



అందిందని తలుస్తాను ఎప్పుడు సొమ్ము పంపినా ఎంతో యిదిగా తెలియబరుస్తారు. మీలాంటి అల్పసంతోషులకు ఏం పంపినా సార్థకం ఉంటుంది. అనకూడదు గాని మా నాన్నలాంటి దురాశాపరులకు ఎంత పంపినా ఒకటే. ఈ మధ్య నా జీతం ఎక్కువైంది. కంపెనీలో ఫండ్సు లేనందువల్ల ఆ పైనెలలోగాని జీతాలు యివ్వరు. వెంటనే ఓ వంద యీ క్రింది ఎడ్రసుకి పంపగోరెదను.'

పదిహేను రోజులు దాటకుండా చంచల ఫీజు అందుకుంది! ఆ తరవాత పాపం ఆమె చాలా చాలా సలహాలు అతనికిచ్చి ఎడిపోతున్న ఒక యిల్లు నిలబెట్టింది.

గురుమూర్తి ఆ పైనెలనుంచి భార్య చేతిలో జీతం పెట్టడం మానేశాడు.

'రెండు లక్షలకి యిన్సూరు చేశాను. నీ పేర వస్తుంది. అందుకని దానికి సగం జీతం పోతోంది.' అని అతను భవానీతో అంటున్నప్పుడు ఆమె అణుమాత్రమయినా ఆశ్చర్యపోక పోవడం అతనికి ఎంతో వింతనిపించింది 'నీకు నెక్లెసు కొందామని అయిదువందలు కోటుజేబులో పెట్టుకుని సరిగ్గా డల్హౌసీ స్క్వేరు దగ్గిర చూసుకుంటే పర్సు లేదు!' అన్నా, ఆమె ఎంత మాత్రం సంశయించలేదు. మరో సారి. పైగా అతనికిప్పుడు అన్ని వైపులనుంచీ కావలసిన త సానుభూతీ, కోరినంత సుఖం, కొనుక్కోగలిగినంత ఆనందం!

* * *

గురుమూర్తి ఎంత కష్టపడి అందరి చేతా "ఔరా!" అనిపించుకుంటున్నాడో చెప్పినా ఎవరూ నమ్మరు గద!